సాక్షి
వికారాబాద్

సోమవారం । 10 । జూలై । 2023



నాసిరకంగా..

గ్రామాల్లో నిర్మించిన కుంతధామాలు పూర్తి కాకముందే పాడవుతున్నాయి. కనీస వసతులు కరువయ్యాయి.
8లో▸



అటకెక్కిన 'జలమణి'

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలమణి పథకం అటకెక్కింది.
8లో▸



మోక్షం ఎన్నడో?

విశ్వనాథ్‌పూర్ సమీపంలో కాకరవేణి నదిపై నిర్మిస్తున్న శివసాగర్ ప్రాజెక్టు కాల్వల నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది.
9లో▸

బీసీల్లో రేసు గుర్రాలు

- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆరాటపడుతున్న నేతలు
- చేవెళ్ల పార్లమెంట్ స్థానం పరిధిలో కాంగ్రెస్ నుంచి ఇద్దరికి అవకాశం
- ముందుగానే ప్రకటించిన పార్టీ అధిష్టానం
- బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి పలువురి ప్రయత్నాలు



తాండూరు: వచ్చే ఎన్నికల్లో ఆయా పార్టీల తరఫున ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసేందుకు పలువురు బీసీ నేతలు ఉత్సాహం చూపుతున్నారు. వీరిలో ఎవరికి అవకాశం లభిస్తుందో తెలుసుకునేందుకు మరికొంత కాలం ఆగాల్సిందే. ఇదిలా ఉండగా.. కర్ణాటక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు దోహదపడ్డ అంశాలను తెలంగాణలోనూ అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే టికెట్ల కేటాయింపులో జనాభా దామాషా ప్రకారం కర్ణాటకలో మాదిరిగా బీసీ ఫార్ములాను అనుసరించాలని నిర్ణయించింది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బీసీ నేతలకే టికెట్లు ప్రకటిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. దీంతో చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల బీసీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు ఎస్సీ రిజర్వ్‌డ్ కాగా మిగిలిన ఐదు స్థానాల్లోని పార్టీ ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో నాలుగు రంగారెడ్డి జిల్లా పరిధిలోని కాగా, మిగిలిన మూడు మన జిల్లాలోనివి. వికారాబాద్ జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్లు పార్లమెంట్ పరిధిలో ఉండగా కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పరిధిలో ఉంది. కొడంగల్‌లో మరోసారి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీ చేసే అవకాశాలు ఉండగా.. వికారాబాద్ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం. ఇక మిగిలింది తాండూరు, పరిగి మాత్రమే.

తాండూరుపైనే దృష్టి..

మన జిల్లాలోని తాండూరు, పరిగి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అయితే పరిగి అసెంబ్లీ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడైన టి.రామ్మోహన్‌రెడ్డి పోటీ లాంఛనమే. ఇక మిగిలింది తాండూరు ఒక్కటే. కాంగ్రెస్ నుంచి తాండూరు అసెంబ్లీ టికెట్ ఎవరికి ఇస్తారనే విషయంపై ఇప్పటికీ పూర్తిస్థాయి స్పష్టత లేదు. తాండూరు అసెంబ్లీ కానిస్టెన్సీ ఏర్పడిన నాటి నుంచి బీసీ(ముదిరాజ్) సామాజిక వర్గానికి చెందిన మహరాజుల కుటుంబ సభ్యులు ముగ్గురు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ఎమ్మెల్సీలుగా నాలుగు దశాబ్దాల పాటు పాలించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి మాణిక్‌రావు తనయుడు, ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తారని ఆ పార్టీ ముందుగానే ప్రకటించింది. అయితే అనారోగ్య సమస్యల కారణంగా చివరి క్షణంలో ఆయన పోటీ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఈసారి ఎలాగైనా టికెట్ సాధించుకుని గెలుపొందాలనే లక్ష్యంతో రమేశ్‌మహరాజ్ తాండూరులో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆయనకు టికెట్ వస్తుందా..? చివరి నిమిషంలో ఇంకెవరైనా పోటీకి వస్తారా..? అనే అంశంపై ప్రస్తుతం పార్టీలో చర్చ సాగుతోంది.

బీఆర్‌ఎస్, బీజేపీల్లో బీసీ నినాదం

బీఆర్‌ఎస్ తరఫున తాండూరు అసెంబ్లీ స్థానంలో పోటీ చేసేందుకు బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ ఆరాటపడుతున్నారు. ఇదిలా ఉండగా బీజేపీ నుంచి ఎలాగైనా టికెట్ సాధించుకోవాలని మాజీ మంత్రి చందుమహరాజ్ తనయుడు నరేష్ మహరాజ్, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్ పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో తాండూరులో బీసీ నేతల మధ్య ఎన్నికల పోరు కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

వచ్చేవి కాంగ్రెస్ ప్రభుత్వాలే

- కేంద్రం, రాష్ట్రంలో అధికారం తథ్యం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- పలు మండలాల నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు



నియామకపత్రాలు అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో రెండు చోట్లా కాంగ్రెస్ పార్టీకి అధికారం తథ్యమని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పరిగి మండల అధ్యక్షుడిగా పరశురాంరెడ్డి, దోమ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌రెడ్డి, కుల్కచర్ల అధ్యక్షుడిగా ఆంజనేయులుముదిరాజ్, పూడూర్ అధ్యక్షుడిగా సురేందర్‌ముదిరాజ్, చౌడాపూర్ అధ్యక్షుడిగా అశోక్‌కుమార్, గండీడ్ అధ్యక్షుడిగా నరసింహారావు, మహమ్మదాబాద్ అధ్యక్షుడిగా నారాయణలకు బాధ్యతలు అప్పగిస్తూ ఆదివారం నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే ఎన్నికలు రానున్నాయని అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ.. అధికారంలోకి వస్తే ఏం చేస్తామో కూడా చెప్పాలన్నారు. ఇకనుంచి నిత్యం ప్రజల మధ్యలో ఉండి పోరాటాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ అలర్ట్

- వానాకాలం నేపథ్యంలో అప్రమత్తమయ్యాం
- ముందస్తు జాగ్రత్తలతో విషజ్వరాలను అదుపు చేశాం
- 'సాక్షి'తో డీఎంహెచ్‌ఓ మాటామంతీ
- ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మొద్దని ఆదేశం
- పరిధి దాటొద్దని ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు సూచన
- ల్యాబ్‌లలో ఫీజు వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలని హితవు



పాల్వన్‌కుమార్, డీఎంహెచ్‌ఓ

వికారాబాద్: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లేదంటే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్ సూచించారు. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. ప్రజలు సహకరిస్తేనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమన్నారు. గతేడాది ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా వందలాది డెంగీ కేసులు నమోదయ్యాయి. దీంతో ఈసారి ముందస్తుగానే ఫీవర్ సర్వే చేపట్టారు. జ్వరం లక్షణాలున్న వారికి సకాలంలో చికిత్సలు అందించడంతో వీటి వ్యాప్తిని నిరోధించగలిగారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ. మిగిలిన వివరాలు ఆయన మాటల్లోనే..

వైద్యులు, సిబ్బందికి దిశానిర్దేశం

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. గ్రామ, మున్సిపల్ వార్డుల స్థాయిలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఫీవర్ సర్వే చేయించాం. గతంతో పోలిస్తే విషజ్వరాల కేసులు ఈసారి చాలా తగ్గిపోయాయి. గతేడాది జిల్లాలో 230 డెంగీ నమోదు కాగా ఈ ఏడాది కేవలం మూడు మాత్రమే వెలుగుచూశాయి. ప్రజలు వైరల్ ఫీవర్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ వైద్యులు, పట్టణ, పల్లె బస్తీ దవాఖానాల్లో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశాం. ఎప్పటికప్పుడు ఆయా కార్యక్రమాలపై రివ్యూ చేస్తున్నాం.

విస్తృత అవగాహన

సీజనల్ వ్యాధుల వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ శుక్రవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో డ్రైడేను పాటించేలా చూస్తున్నాం. స్వయం సహాయక సంఘాల సహకారంతో మహిళలకు చైతన్యం కల్పిస్తున్నాం. వీటితో పాటు రెగ్యులర్ కార్యక్రమాలైన ఇమ్యునైజేషన్, ఇనిస్టిట్యూషనల్ డెలివరీ (ఆస్పత్రులలో ప్రసవం)లు, ప్రభుత్వ ల్యాబ్‌లలో టెస్టుల నిర్వహణ, ఏఎన్‌సీ, పీఎన్‌సీ చెకప్‌లు, కరోనా టెస్టులను యథావిధిగా నిర్వహిస్తున్నాం. ఈ విషయంలో మన జిల్లా రాష్ట్రంలోనే ఐదో స్థానంలో ఉంది. రెగ్యులర్‌గా నిర్వహించే సేవల్లోనూ టాప్‌గా నిలుస్తున్నాం.

అన్ని పీహెచ్‌సీల్లో కాన్పులు

జిల్లాలో మొత్తం 24 ప్రాథమిక(పీహెచ్‌సీ) ఆరోగ్య కేంద్రాలు, 134 సబ్ సెంటర్లు ఉన్నాయి.. ఇందులో ఏడు రౌండ్ ది క్లాక్(24 గంటలు పని చేసే) పీహెచ్‌సీలు ఉన్నాయి. ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీలన్నింటిలో నిరంతర కాన్పులు చేస్తున్నాం. హైరిస్క్ కేసులుంటే జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నాం. అన్ని ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేలా డాక్టర్లు, సిబ్బందికి తగిన ఆదేశాలు ఇస్తున్నాం. పరిధి దాటి వ్యవహరిస్తే ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై చర్యలు తీసుకుంటాం. ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎవరూ మందులు విక్రయించకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్థమయ్యేలా ప్రిస్క్రిప్షన్ రాయాలి.

డబ్బు వృథా చేసుకోవద్దు

నిబంధనలు పాటించని ల్యాబ్‌లపై చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. సదరు సెంటర్లలో ఏయే వైద్య పరీక్షలకు ఎంతెంత ఫీజు తీసుకుంటున్నారో.. తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేదలు ప్రభుత్వ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి. వికారాబాద్‌లోని ల్యాబ్‌లో 48 రకాల టెస్టులు చేయించుకునే అవకాశం ఉంది. ఇవన్నీ ఉచితంగా చేస్తారు. ఇందుకోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం కూడా లేదు. స్థానిక పీహెచ్‌సీల్లో నమూనాలు ఇచ్చినా సరిపోతుంది. ఫోన్‌ద్వారా ఫలితాలు అందజేస్తున్నాం.

న్యూస్‌రీల్

రేపు స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్స్

తాండూరు రూరల్: తాండూరు మండలం, పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్ల కోసం మంగళవారం ఎంపిక నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెంకటయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సెలెక్టయిన వారికి హకీంపేట్, ఆదిలాబాద్, కరీంనగర్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. 4, 5 తరగతుల్లో అడ్మిషన్లు పొందే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని పాత శాలివాహన కళాశాల మైదానంలో ఉదయం 9గంటల నుంచి నిర్వహించే సెలెక్షన్స్‌కు బోనోఫైడ్‌తో హాజరు కావాలని తెలిపారు.

ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షురాలిగా సాహు శ్రీలత



జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా నుంచి నియామక పత్రం అందుకుంటున్న శ్రీలత

తాండూరు: ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలని ఇంటర్నేషనల్(ఐవీఎఫ్) వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన ఐవీఎఫ్ దశాబ్ది ఉత్సవాలకు జిల్లా నుంచి ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తాండూరు మున్సిపల్ కౌన్సిలర్ సాహు శ్రీలతను ఐవీఎఫ్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నిమమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కట్ట సరిత, కోశాధికారిగా నేమలిగ స్వాతి, ఉపాధ్యక్షురాలిగా ఉమ్మాజి సరిత, కార్యదర్శిగా భానురు స్వాతికి బాధ్యతలు అప్పగించారు.

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దంపతులకు సన్మానం



ఎమ్మెల్యే దంపతులతో గౌతాపూర్ సర్పంచ్, కుటుంబ సభ్యులు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, ఆర్తిరెడ్డి దంపతులను గౌతాపూర్ సర్పంచు దంపతులు రాజప్ప, సుజాత సన్మానించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద నిర్వహించిన యాగాలకు హాజరైన వీరు ఎమ్మెల్యే దంపతులను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

దిగొచ్చిన చికెన్



వికారాబాద్ అర్బన్: చికెన్ ధర దిగొచ్చింది. రెండు నెలల పాటు కిలోకు రూ.300 నుంచి రూ.340 వరకు పలకగా.. గడిచిన వారం రోజుల్లో ఏకంగా రూ.100 తగ్గింది. ఆదివారం మార్కెట్లో కిలో చికెన్ రూ.250 చొప్పున విక్రయించారు. ధర తగ్గడంతో కోడికూర ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు మూడు నెలల పాటు ఇవే ధరలు కొనసాగవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



తాండూరులో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

తాండూరు: ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రముఖ ఉపాధ్యాయుడు సిద్ధిరామేశ్వర్ మాట్లాడుతూ.. జ్ఞానం, శీలం, ఏకత, జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయంగా 75 ఏళ్ల క్రితం ఐదుగురితో ప్రారంభమైన ఏబీవీపీ ప్రస్తుతం 45 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా గుర్తింపు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మానిశ్వరాచారి, పట్టణ అధ్యక్షుడు నర్సింహులు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏసీఆర్ దారెటు?

- ఎటూ తేల్చుకోలేకపోతున్న మాజీ మంత్రి
- బీజేపీ పెద్దల తీరుపై అసంతృప్తి
- కొన్నాళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరం
- కాంగ్రెస్‌లోకి వెళ్తారని ప్రచారం



చంద్రశేఖర్, బీజేపీ నేత

వికారాబాద్: బీజేపీ నేత, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పార్టీ మారనున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్న ఆయన కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం, కేడర్ బలోపేతానికి కృషి చేయడం వంటివి కనిపించడం లేదు. తాజాగా వరంగల్‌లో నిర్వహించిన ప్రధాని మోదీ సభకు సైతం ఆయన గైర్హాజరవడం చర్చనీయాంశంగా మారింది. తనకు ఆహ్వానం అందనందునే ఆ సభకు వెళ్లలేదని చెప్పుకొస్తూనే.. కమలం నాయకత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఇదే విషయాన్ని తన సన్నిహితులు, మీడియా సంస్థల వేదికగా అసహనం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ మార్పు, ఎస్సీ వర్గీకరణ తదితర అంశాల్లో అధిష్టానంపై విమర్శలు చేస్తున్నారు. దీంతో ఇటీవల ఏసీఆర్ దారెటు..? అనే చర్చ జరుగుతుంది.

చంద్రశేఖర్ ఇంటికి ఈటల

బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్.. ఇటీవల హైదరాబాద్‌లోని చంద్రశేఖర్ నివాసానికి వెళ్లారు. ఏసీఆర్ పార్టీ వీడనున్నారనే పుకార్ల నేపథ్యంలోనే ఆయనను బుజ్జగించేందుకే ఈటల వచ్చారనే ప్రచారం జరుగుతోంది.

వేచి చూద్దాం..

ఏసీఆర్ పార్టీ మారటం ఖాయమని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ఆయన కాంగ్రెస్‌తో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే బీఎస్పీ నేతలు సైతం ఆయన్ను ఆహ్వానిస్తుండగా ఏ పార్టీలోకి వెళ్లాలి..? ఇప్పుడే బీజేపీని వీడాలా వద్దా..? అనే విషయంలో వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నట్లు సమాచారం. తన రాజకీయ ప్రస్థానంలో ఇప్పటికే ఐదు పార్టీలు మారిన ఏసీఆర్ మరోసారి బీజేపీ వీడనున్నారనే చర్చ ఊపందుకుంది. ఇటీవల కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్‌కు అనుకూల ఫలితాలు రావడం, రాష్ట్రంలో బీజేపీ ఒడిదుడుకులు ఎదుర్కొంటుండటం.. చంద్రశేఖర్‌కు కాంగ్రెస్‌తో ఇప్పటికీ సత్సంబంధాలుండటం వంటి కారణాల నేపథ్యంలో ఆయన హస్తం గూటికి చేరుతారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఐదు పార్టీలు మారిన ఆయన టీడీపీ, టీఆర్‌ఎస్‌లో మినహా ఎక్కడా ఎక్కువ కాలం ఇమడలేకపోయారు. ఈ క్రమంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన మూడు సార్లు మంత్రిగా కూడా పనిచేశారు. 2009 ఉప ఎన్నికల్లో గడ్డం ప్రసాద్ చేతిలో ఓటమి చవిచూసిన రాజకీయంగా మళ్లీ కోలుకోలేదు.. ఆ తర్వాత పోటీ చేసిన ప్రతీసారి విఫలమయ్యారు. గతంలోనే ఉన్నత పదవులు అనుభవించిన ఆయనకు ఏళ్లతరబడి అధికారం దూరమైంది. ఈ నేపథ్యంలో ఏ పార్టీ అయితే ఏంటి..? గెలవడమే ముఖ్యం అనేలా ముందుకు సాగుతున్నారు.

ప్రాణాలైనా అర్పిస్తాం .. ఫార్మాసిటీ రానివ్వం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రొ.కోదండరాం తదితరులు

యాచారం: ఫార్మాసిటీ బాధిత గ్రామాల్లో ప్రజా యాత్రలో భాగంగా ఆదివారం నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ గ్రామాల మధ్యన నిర్మించిన ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట స్తూపం వద్ద ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, పర్యావరణవేత్తలు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి శ్రేణులు ప్రతిజ్ఞ చేశారు. ఫార్మాసిటీని ఏర్పాటు కాకుండా అడ్డుకుంటాం.. ప్రాణాలైనా అర్పిస్తాం గానీ ఫార్మాసిటీని రానివ్వం అంటూ ప్రతిజ్ఞ చేశారు. 2018లో ఫార్మాసిటీపై ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించిన స్థలంలోనే స్థానిక రైతులు ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట స్తూపాన్ని నిర్మించారు.

వైభవంగా యాగాలు

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తలపెట్టిన శ్రీ రాజశ్యామల, శతచండీ, సౌర, లక్ష్మీ సుదర్శన సహిత అతిరుద్ర మహాయాగాలు ఆదివారం ఏడో రోజు అట్టహాసంగా సాగాయి. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దంపతులతోపాట, వందలాది జంటలు యాగంలో కూర్చొని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే నివాసం నుంచి ఉత్సవ విగ్రహాలను ఒంటె, గజ, అశ్వ వాహనాలపై ఊరేగించారు. సాయిపూర్‌లోని ఆంజనేయస్వామి, అమ్మవారి ఆలయాల్లో ఎమ్మెల్యే దంపతులు పూజలు చేశారు.

– తాండూరు



సాయిపూర్‌లో గజారోహణంలో ఎమ్మెల్యే దంపతులతో పాటు భక్తులు

మైనార్టీ స్కూళ్లలో అక్రమాలను అరికట్టాలి

విద్యార్థి జేఏసీ నేతల డిమాండ్



విద్యార్థి సంఘం నాయకులు

తాండూరు: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి జేఏసీ నాయకులు ఆరోపించారు. ఆదివారం తాండూరులో విద్యార్థి సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనార్టీ గురుకులాల్లోని ఖాళీ పోస్టులను ఇష్టారాజ్యంగా భర్తీ చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం అమలు చేయడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానాన్ని అనుసరిస్తున్నా.. మైనార్టీ గురుకులాల్లో మాత్రం లాటరీ పద్ధతితో పాటు తమకు నచ్చిన విధంగా సీట్లు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. కాలేజీల నిర్వాహకులు తాము చెప్పిందే వేదం అనేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఈ.శ్రీనివాస్, బీఆర్‌ఎస్వీ నేత జిలానీ, గోర్‌బంజారా నేత అరుణ్‌నాయక్, టీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు ఆకీఫ్ పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ 9వ డివిజన్‌లో రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ, బీటీ రోడ్లకు ఆదివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో మీర్‌పేట కార్పొరేషన్‌ను కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ట్రంక్‌లైన్, నాలాల నిర్మాణంతో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని, మురికిమయంగా ఉన్న గొలుసు కట్టు చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మిషన్ భగీరథ, పెన్షన్ల పెంపు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సొంత స్థలం ఉన్న వారికి రూ.3 లక్షల ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబీమా, రైతుబంధు, ఉచిత విద్యుత్, చేతివృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం, గౌడన్నలకు రూ.5 లక్షల బీమా వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశమంతా తెలంగాణ వంటి పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ప్రశాంతిహిల్స్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి తదితరులు

క్లుప్తంగా

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోండి

బంట్వారం: మండల రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అష్పక్ రసూల్ ఆదివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ధరణికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేయాలని సూచించారు.

శరవేగంగా గోదాం నిర్మాణ పనులు



నిర్మాణ దశలో పీఏసీఎస్ గోదాం

దౌల్తాబాద్: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దౌల్తాబాద్‌లో గోదాం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో పీఏసీఎస్ అధికారులు రూ. 1.48కోట్లు పనులు చేపట్టారు. ఇప్పటికే 70శాతం పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ నెలాఖరు నాటికి గోదాం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని పీఏసీఎస్ చైర్మన్ శేరి వెంకట్‌రెడ్డి తెలిపారు.

కలప వాహనం సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

మోమిన్‌పేట: అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాన్ని మోమిన్‌పేటలో ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ విఠల్ రెడ్డి కథనం మేరకు.. మోమిన్‌పేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా కలప రవాణా చేస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. డ్రైవర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం



జెండా ఆవిష్కరణలో ఏబీవీపీ నేతలు

ఇబ్రహీంపట్నం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తున్నట్లు ఆ సంఘం గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి అన్నారు. ఏబీవీపీ 75వ ఆవిర్భావ, జాతీయ విద్యార్థి దినోత్సవాలను పురస్కరించుకొని ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో ఏబీవీపీ పురుడుపోసుకున్నదన్నారు. నేడు దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా కొనసాగుతుందన్నారు. ఏబీవీపీ జ్ఞానం, శీలం, ఏకత అనే అంశాలను వేదాలుగా మలుచుకొని జాతీయ పునర్నిర్మాణానికి ప్రాధాన్యతను ఇస్తూ విద్యార్థి సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయిధన్‌రాజ్, జగదీశ్, సందీప్, పవన్, విక్రమ్, సాయి, కిరణ్, వరుణ్‌లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటోడ్రైవర్ దుర్మరణం

పెద్దేముల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటోడ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారురు మండలం గట్టెపల్లికి చెందిన ప్రణయ్ చార(24) ఆటో నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి గట్టెపల్లి నుంచి ఆటోలో పెద్దేముల్ మండలం ఇందూరు గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో గొట్లపల్లి గేట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు ప్రమాద విషయాన్ని పెద్దేముల్ పోలీసులకు తెలిపారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని ఆటోలో ఇరుక్కుపోయిన ప్రణయ్ చారిని కష్టపడి బయటకు తీశారు. అప్పటికే మరణించినట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రణయ్‌చారి మృతదేహం

నాసిరకంగా వైకుంఠధామాలు

- పలుచోట్ల అసంపూర్తిగా పనులు
- పట్టించుకోని అధికారులు

పెద్దేముల్: మండలంలో వైకుంఠధామాలు పూర్తి కాకముందే పాడవుతున్నాయి. కనీస వసతులు కరువయ్యాయి. మూడేళ్ల క్రితం ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి పీఆర్, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల ద్వారా పనులు మంజూరు చేసింది. అయితే నేటికీ పలు పంచాయతీల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. చేసిన పనులు కూడా నాసిరకంగా ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు పర్సెంటేజీలపై చూపుతున్న శ్రద్ధ పనుల నాణ్యతపై దృష్టి పెట్టడం లేదని అంటున్నారు. పనుల్లో నాణ్యత లోపించిన విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ప్రజలు తెలిపారు. మండలానికి మూడేళ్ల క్రితం పంచాయతీ రాజ్ ద్వారా



చైతన్యనగర్‌లో అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామం

-34, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా -3 వైకుంఠధామాలను ప్రభుత్వం మంజురు చేసింది. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, మరి కొన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్లు పనులు చేశారు. వైకుంఠధామాల వద్ద నీటి వసతి తోపాటు విద్యుత్ సదుపాయం విధిగా ఉండాలి. కానీ ఎక్కడా పూర్తి స్థాయిలో వసతులు కనబడడం లేదు. మరి కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు ప్రారంభోత్సవం కాకముందే పాడవుతున్నాయి.



చైతన్యనగర్‌లో ప్రారంభం కాకముందే దెబ్బతిన్న బర్నింగ్ ప్లాట్‌ఫామ్

మరి కొన్ని ప్రాంతాల్లో బీటలు వారినా అధికారులు పట్టించుకోవడం లేదు. చైతన్యనగర్ గ్రామ పంచాయతీలో వైకుంఠధామ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 12లక్షలు మంజురు చేసింది. పనులు పూర్తి కాకముందే బర్నింగ్ ప్లాట్‌ఫామ్ దెబ్బతింది. గోడలు బీటలు వారుతున్నాయి. ఇప్పటి వరకు రూ. 8లక్షలకు పైగా నిధులు విడుదలైనట్లు పంచాయతీ రాజ్ ఏఈ సిద్ధార్థ తెలిపారు. ఆత్కూర్ గ్రామంలో కూడా వైకుంఠధామం బీటలు వారడంతో సిమెంట్ పూతలు పూసి బిల్లులు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా పలు గ్రామాల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. సకాలంలో బిల్లులు రాక పనులు ఆలస్యం అవుతున్నట్లు సర్పంచులు తెలిపారు.

నాణ్యత లేకుంటే బిల్లులు ఆపేస్తాం

వైకుంఠధామాల పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపేస్తాం. మళ్లీ వాటిని బాగు చేయిస్తాం. నాణ్యతలో రాజీ పడేదిలేదు. పనుల జరిగే ప్రాంతాలకు వెళ్లి పరిశీలించిన తరువాతే రికార్డుల్లో నమోదు చేస్తున్నాం. మండలంలో 80శాతం వరకు పనులు పూర్తయ్యాయి. 20శాతం బిల్లులు మాత్రమే రావాల్సి ఉంది. మిగితా పనులను కూడా త్వరలోనే పూర్తి చేయిస్తాం.

– సిద్ధార్థ, పీఆర్ ఏఈ, పెద్దేముల్ మండలం

వైభవంగా బోనాలు

మర్పల్లి: మండలంలోని కోట్‌మర్పల్లి, కొత్లాపూర్ గ్రామాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రతి ఇంట్లో బోనాలను అందంగా అలంకరించారు. సాయంత్రం డప్పు వాయిద్యాల మధ్య బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించారు. వేడుకలో ఆయా గ్రామాల సర్పంచులు విజయలక్ష్మి, ప్రభాకర్ పాల్గొన్నారు.



కొత్లాపూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కేసీఆర్‌వి మాయమాటలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

బంట్వారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. కోట్‌పల్లి మండలం మోత్కుపల్లిలో ఇతర పార్టీలకు చెందిన పలువురు ఆదివారం ప్రసాద్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ మాయమాటలకు మరో సారి మోసపోవద్దని అన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే తప్పా కొత్తగా వారు చేసిందేమీ లేదని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన ‘జలమణి’

- ప్రభుత్వ పాఠశాలల్లో కనిపించని తాగునీటి పథకం
- విద్యార్థులకు బోరు, నల్లా నీరే దిక్కు

వికారాబాద్ అర్బన్: విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2009లో జలమణి పథకాన్ని ప్రారంభించింది. అయితే ఈ పథకం ఇప్పుడు పూర్తిగా మరుగున పడిపోయింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉన్న సమయంలో ప్రస్తుత వికారాబాద్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకం కింద శుద్ధజల యంత్రాలు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల తరువాత అవి మూలకు చేరాయి. ఫలితంగా విద్యార్థులకు సురక్షిత నీరు అందడం లేదు. అత్యధిక పాఠశాలల్లో బోరు నీరు లేక విద్యార్థులు నల్లా నీటినే తాగి అనారోగ్యం పాలవుతున్నారు.

పత్తాలేని యంత్రాలు

జలమణి మొదటి విడతలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 139 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో 44 పాఠశాలల్లో జల శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్య వందలోపు ఉంటే రూ. 14,850 కేటాయించి 50లీటర్ల సామర్థ్యం ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. 200 మంది విద్యార్థులు ఉన్న చోట 100 లీటర్లు, 300 మంది విద్యార్థులు ఉన్న చోట 150 లీటర్ల సామర్థ్యం ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అప్పట్లో వాటి నిర్వహణ బాధ్యతను ఆర్‌డబ్ల్యూస్, ఆర్వీం అధికారులకు అప్పగించారు. కొన్నాళ్లు పాటు బాగానే సాగినా ఆ తరువాత అధికారుల పర్యవేక్షణ లేక యంత్రాలు మూలకు చేరాయి.

బోరు, నల్లా నీరే దిక్కు

ప్రస్తుతం చాలా పాఠశాలల్లో విద్యార్థులు బోరు, నల్లా నీరు, మిషన్ భగీరథ నీటినే తాగుతున్నారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకొని మధ్యాహ్న భోజనం సమయంలో తాగుతున్నారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో నీరు కలుషితం అవుతోంది. ఈ నీరు తాగితే పిల్లలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి పిల్లలకు సురక్షితమైన నీటిని అందించాలని వారు కోరుతున్నారు.



వికారాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నల్లా నీరు తాగుతున్న విద్యార్థినులు

పరిహారం ఎప్పుడు మహాప్రభో..?

- వడగండ్ల వర్షాలకు భారీగా పంట నష్టం
- మూడు నెలలు గడుస్తున్నా అందని పరిహారం
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

మర్పల్లి: పంట నష్టపరిహారం ఎప్పుడు ఇస్తారని మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రభుత్వ హామీ ఇప్పటికీ నెరవేరలేదని, అండగా ఉంటామన్న మంత్రుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయానని సదరు రైతులు వాపోతున్నారు. 3 నెలల క్రితం మండలంలో వడగండ్లు సృష్టించిన భీబత్సానికి కూరగాయల పంటలు, ఉద్యానపంటలు 2,500 ఎకరాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్‌తో పాటు కలెక్టర్ నారాయణరెడ్డి



బూచన్‌పల్లిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏఈఓ (ఫైల్)

వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు భరోసా ఇచ్చారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి అధికారులు నివేదిక కూడా పంపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వడగండ్ల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేలు ఇస్తామని హామీ ఇచ్చినా.. ఇంతవరకు ఏ ఒక్క రైతుకూ పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టం పరిహారమిస్తే ఖరీఫ్ పంట పెట్టుబడులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

టమాటా పంట దెబ్బతింది

వేసవి పంటగా రెండు ఎకరాల్లో టమాటా సాగు చేశా. వడగండ్ల వర్షానికి చేతికొచ్చిన పంట నెలపాలైంది. సుమారు రూ. 40 వేల వరకు పెట్టుబడి పెట్టా. కేసీఆర్ పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం ఇస్తామన్నారు. 3 నెలలు గడుస్తున్నా ఇంతవరకు హామీ అమలు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిహారం ఇవ్వాలి.

– సంతోష్‌రెడ్డి, రైతు, కోట్‌మర్పల్లి

ప్రభుత్వానికి నివేదిక పంపాం

అకాల వర్షాలకు పాడైన పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపాం. గ్రామాలవారీగా పంట నష్టం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. పరిహారం విడుదల కాగానే నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

– మహేశ్, ఏఈఓ, సిరిపూరం క్లస్టర్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలన్నారు. భక్తితోనే ముక్తి సాధ్యమన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఆలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడు కృషి చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని అమ్మవారికి కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.



మైసమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

చినుకు పడితే చీకటే..!

- వెలగని వీధి దీపాలు
- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

వికారాబాద్ అర్బన్: అది జిల్లా కేంద్రం.. జిల్లా అధికార యంత్రాంగమంతా అక్కడ నుంచే విధులు నిర్వర్తిస్తూ ఉంటారు. కానీ చిన్నపాటి వర్షానికే అక్కడ చిమ్మచీకట్లు ఆవరిస్తాయి. రాత్రిపూట అడుగు వేయాలంటనే ప్రజలు భయపడి పోతున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో లైట్లు వెలగడం లేదు. వర్షాలు పడుతుండడంతో అనేక చోట్ల విద్యుత్ లైట్లు కాలిపోయాయి. వాటి స్థానంలో కొత్తవి బిగించాలని, లేకుంటే మరమ్మతులు చేయాలని స్వయంగా కౌన్సిలర్లు అడిగినా అటు మున్సిపల్ సిబ్బంది కానీ.. ఇటు విద్యుత్ అధికారులు కానీ స్పందించడం లేదు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లతో పాటు, శివారు వార్డుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఎప్పుడు వాహనాలతో బిజీగా ఉండే రైల్వే బ్రిడ్జిపై విద్యుత్ లైట్లు వెలగక నెలలు గడుస్తోంది. నెలరోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే మీతో నేను అనే కార్యక్రమంలో భాగంగా సాకేత్ నగర్, కమలానగర్‌లో పర్యటించారు. రైల్వే బ్రిడ్జిపై విద్యుత్ లైట్లు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే మరమ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అయినా చలనం కనిపించ లేదు.



మున్సిపల్ పరిధిలోని ఓ రోడ్డులో వెలగని విద్యుత్ దీపాలు

రూ. 5.50 లక్షలు ఇస్తున్నా..

మున్సిపాలిటీలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుతో పాటు వాటి మరమ్మతు బాధ్యతను 2017లో ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) సంస్థ తీసుకుంది. సంస్థ ప్రతి నెలా మున్సిపాలిటీ నుంచి రూ. 5.50 లక్షలు తీసుకుంటున్నా.. విద్యుత్ సేవలు అందించక పోవడంపై ప్రజా ప్రతినిధులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ నిర్వాహకులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రధాన రోడ్లు, కాలనీల్లో విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రావి చెట్టుకు పుట్టిన రోజు వేడుకలు

తలకొండపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రావిచెట్టుకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. 2016లో జర్నలిస్టు బోళ్ల యాదయ్య మొక్క నాటారు. అది పెరిగి పెద్దదై వందలాది మందికి నీడనిచ్చే చెట్టుగా ఎదిగింది. ఈ సందర్భంగా ఆదివారం చెట్టుకు 7వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో హాజరయ్యారు. కేక్ కట్ చేశారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు పండ్లు పంచారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ నర్సింహ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏటా లక్షలాది మొక్కలు నాటి అడవుల పెంపకానికి తోడ్పడాలన్నారు. ఈ హరితహారం దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి, మాజీ ఎంటీటీసీ యాదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రావి చెట్టుకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

బ్రహ్మగర్జనకు బ్రాహ్మణులు

తాండూరు: బ్రాహ్మణుల హక్కుల సాధన, ఆత్మగౌరవం కోసం నగరంలో తలపెట్టిన బ్రహ్మ గర్జన సభకు ఆదివారం పట్టణం నుంచి బ్రాహ్మణులు తరలివెళ్లారు. పట్టణంలోని సీతారాంపేట్ పాండు రంగ స్వామి ఆలయంలో పూజలు చేసి వాహనాల్లో నగరానికి తరలివెళ్లారు.



బ్రహ్మగర్జన సభకు వెళ్తున్న బ్రాహ్మణులు

సంక్షేమ పథకాలే గెలుపునకు దోహదం

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మూడోసారి గెలిపిస్తాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి, చాకలిగూడ, సజ్జన్‌పల్లి, కంచెమోనీగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో పల్లె పల్లెకు కేఎస్.రత్నం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 60గ్రామాల్లో పర్యటించామన్నారు. నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట్ మండలాలలో బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భాస్కర్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మోత్కుపల్లి సర్పంచ్ రత్నం, నాయకులు కొండల్‌రెడ్డి, చిరాగ్ మోహన్‌గౌడ్, మాధవ రెడ్డి, కొండల్‌రెడ్డి, మహేందర్, నీలకంఠం, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆరే సీఎం

మొయినాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆరే తెలంగాణ రాష్ట్రానికి మూడోసారి సీఎం అవుతారని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. పల్లె పల్లెకు రత్నం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని చిన్నషాపూర్‌లో ఆయన పర్యటించారు. ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ కుటుంబానికి అందుతున్నాయన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని.. మరోసారి కేసీఆర్‌నే ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సారి చేవెళ్ల టికెట్ తనకే వస్తుందని.. ఎమ్మెల్యేగా గెలుస్తున్నానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోత్కుపల్లి సర్పంచ్ రత్నం, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల రాకతో పరుగులు

- కోట్‌పల్లి ప్రాజెక్టుకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- నిషేధం అమల్లో ఉన్నందున తిరిగి వెళ్లాలని కోరిన పోలీసులు

ధారూరు: పోలీసు వాహనం సైరన్ మోత.. దాని ముందు పోలీసులు.. వారి ముందు పర్యాటకుల పరుగు.. ఇదేంటి అనుకుంటున్నారా..? ఆదివారం మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద చోటుచేసుకున్న దృశ్యమిది. అదేంటి పర్యాటకులు పరుగు తీయాల్సిన అవసరమేముందని అనుకుంటున్నారా..? ప్రాజెక్టు ఒడ్డున, దాని పరిసరాల్లో కనిపించిన పర్యాటకులను అక్కడి నుంచి బలవంతంగా పంపించడానికి పోలీసులు చేసిన హడావుడి. కొన్ని నెలల క్రితం కోట్‌పల్లి ప్రాజెక్టులో నీట మునిగి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోయారు. అప్పటి నుంచి ప్రాజెక్టు వద్దకు పర్యాటకులను నిషేధించారు. ఆదివారం కావడంతో ప్రాజెక్టు వద్దకు భారీగా పర్యాటకులు వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు కూడా అక్కడి వచ్చి పర్యటకులను బలవంతంగా పంపించేశారు. సెలవు రోజు సరదాగా గడపడానికి వస్తే ఇలా వెనక్కు పంపడం ఏమిటని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టు నీటిలోకి ఎవరూ దిగకుండా, ఈత కొట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలే తప్ప.. ఒడ్డున సంచరిస్తూ, సేదతీరే వారిని అడ్డుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నీటిలో దిగిన వారిని కట్టడి చేస్తే సరిపోతుందని వారు పేర్కొన్నారు. కొంతమంది పర్యాటకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. చివరకు చేసేదేమీ లేక పర్యాటకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



పోలీసు వాహనాన్ని చూసి వెళ్లిపోతున్న పర్యాటకులు



ప్రాజెక్టు వద్ద నుంచి వెళ్లిపోవాలని పర్యాటకులకు నచ్చజెబుతున్న పోలీసులు